ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

మోదీ సర్కారుకు గుణపాఠం చెప్పాలి

యాచారం, ఏప్రిల్26 : ఉపాధి హామీ పథకాన్ని తీసివేసే పనిలో ఉన్న మోదీ సర్కార్‌కు కూలీలు తగిన బుద్ధి చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. మండలంలోని మల్కీజ్‌గూడ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వేసవిలో కూలీలకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. కూలీలకు నీడ, తాగునీరు, మెడికల్ కిట్, రవాణా, గడ్డపార, పార ఖర్చులు చెల్లించడంతో పాటు ఎండ సమయంలో పని చేయించొద్దన్నారు. కూలీలు వడ దెబ్బకు గురైతే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారని, కూలీలకు ఇవ్వాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తున్న మోదీ సర్కారుకు కూలీలు, ప్రజలు ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

ధాన్యాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి అరుణ

ఆమనగల్లు, ఏప్రిల్ 26: ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని, శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని అధికారులు పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి నాణ్యమైన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువస్తే కనీస మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. ఎండిన ధాన్యం 17శాతం తేమ ఉండేలా చూడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అరుణ, పీఏసీఎస్ ఇన్‌చార్జి పద్మాకర్, రైతులు రామస్వామి, పద్మనాయక్, లక్ష్మి, యాదయ్య, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మహత్యలు చేసుకోవద్దు

ఉదయ్‌కిరణ్ తండ్రిని ఓదార్చుతున్న జడ్పీటీసీ

కడ్తాల్, ఏప్రిల్ 26: పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, మనస్తాపానికి గురై బలవన్మరానికి పాల్పడకూడదని మండల జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన సోమరాజు పాండు పుష్ప దంపతులు కొన్ని సంవత్సరాలుగా తమ పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సోమరాజు పాండు కుమారుడు ఉదయ్‌కిరణ్ (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో ఒక సబెక్టు ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ఇంట్లో గురువారం ఉరివేసుకుని బలవన్మరానికి పాల్పడ్డాడు. ఈ మేరకు పోస్ట్‌మార్టం అనంతరం శుక్రవారం ఉదయ్‌కిరణ్ మృతదేహాన్ని స్వగ్రామం రావిచేడ్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు రావిచేడ్ గ్రామానికి చేరుకుని ఉదయ్‌కిరణ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ భారతమ్మ నాయకులు రమేశ్, లింగం ఉన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని
వ్యక్తి మృతి

కొత్తూరు, ఏప్రిల్ 26: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరులోని రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగింది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ వివరాల ప్రకారం..ఉదయం 11 గంటల సయమంలో ఓ వ్యక్తి రైలు పట్టాల పైనుంచి నడుచుకుంటూ వెళుతుండగా, రైలు ఢీ కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వయసు సుమారు 42 ఏండ్లు ఉంటాయని పేర్కొన్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, బ్లాక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని వివరించారు. మృతుడు కొత్తూరు పారిశ్రామిక వాడలో పనిచేసే కార్మికుడై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో భద్రపరచామని వివరించారు. మృతుడి వివరాలు తెలిస్తే 9848090426 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు

కొందుర్గు నయాబ్ తహసీల్దార్, రికార్డు అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు

షాద్‌నగర్, ఏప్రిల్ 26 : కొందుర్గు మండలం తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నయాబ్ తహసీల్దార్ కిష్టయ్య, రికార్డు అసిస్టెంట్ బాలరాజులపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో ఓ ఆర్మీ అధికారి నుంచి భూ పత్రాల కోసం డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణపై విచారణ జరిపిన సంబంధిత శాఖ ఉన్నత అధికారులు ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నారు.

మద్యం, డబ్బుల పంపిణీని అరికడుతాం..

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు
నియోజకవర్గంలో ఆరుచోట్ల చెక్‌పోస్టుల ఏర్పాటు
ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అడ్డుకోవటం కోసం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం, డబ్బు అక్రమ రవాణాను అడ్డుకోవటం కోసం నియోజకవర్గంలోని బొంగ్లూరు ఔటర్‌రింగ్‌రోడ్డు, బొంగ్లూరుగేటు, మంగల్‌పల్లి ఎక్స్‌రోడ్డు, కొత్తగూడ ఎక్స్‌రోడ్డు, అబ్దుల్లాపూర్‌మెట్, మాల్ తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చెక్‌పోస్టుల ద్వారా ఇప్పటివరకు రూ.12,08,550 సీజ్‌చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, లిక్కర్, డ్రగ్స్ వంటివాటిని కూడా సీజ్‌చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 3,39,341ఓట్లున్నాయని, ఇందులో 1,70,807పురుష ఓటర్లు, 1,68,499స్త్రీల ఓటర్లున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 343పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈవీఎంలు కూడా ఇబ్రహీంపట్నానికి చేరుకున్నాయని, వీటిని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపర్చినట్లు వివరించారు. ఈ ఎన్నికల్లో మద్యం, డబ్బుల పంపిణీని పూర్తిస్థాయిలో అరికడుతామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రేవంత్ ముఖ్యమంత్రా.. ప్రతిపక్షనాయకుడా..

- కొడంగల్‌ను అభివృద్ధి చేయలేదు.. కేవలం మోసపూరిత మాటలే..
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై పార్లమెంటులో ప్రశ్నించాడా..?
- మహిళలపై చిన్నచూపు.. విచక్షణా రహితంగా దూషణలు..
- ఎవరిని చంపి పేగులు మెడలో వేసుకుంటావ్?
- సీఎంగా ఉండి ఎలా మాట్లాడాలో నేర్చుకో..
- కొడంగల్‌లో విలేకరుల సమావేశంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కొడంగల్, ఏప్రిల్ 26: రేవంత్‌రెడ్డి సీఎంగా కాకుండా ప్రతిపక్ష నాయకుడిగా పాత్రను పోషిస్తున్నట్లు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ పేర్కొన్నారు. శుక్రవారం కొడంగల్ విచ్చేసిన ఆమె స్థానిక బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పున్నంచంద్ లాహోటీ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం అంటే ఏవిధంగా వ్యవహరించాలో తెలియదని, ఒక్కసారైనా మంత్రిగా వ్యవహరిస్తే కొంచెమైనా అవగాహన ఉండేదని ఎద్దేవా చేశారు. ప్రజల్లో మోదీ ప్రభంజనం కనిపించడంతో రేవంత్‌కు దిమ్మతిరిగి మతిస్థిమితం తప్పి మాటలు మాట్లాడుతున్నట్లు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి కొడంగల్ అభివృద్ధికోసం ఏమీ చేయలేదన్నారు. ఇప్పుడు సీఎంగా అవకాశం వచ్చిందని మాటలు మాత్రమే చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని, కొడంగల్ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధికి పటుపడాలన్నారు.. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఏ ఒక్కరోజైనా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై మాట్లాడిన దాఖలాలు ఉన్నాయా.. ఎప్పుడైనా ప్రాజెక్టుల కోసం పోరాటం చేశారా అని అని ప్రశ్నించారు. ప్రజలపై, అభివృద్ధిపై ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, మాయమాటలతో గెలిచి ప్రజలకు అందుబాటులో లేకుండా స్వంత రాజకీయాలు చేసుకోవడం ఆయన నైజంగా పేర్కొన్నారు. ఓడిపోతున్నామని తెలిసి రేవంత్‌కు మతి భ్రమించింది కాబట్టే మానవ బాంబునవుతా, పేగులు మెడల వేసుకుంటానని విచక్షణ రహితంగా మాట్లాడుతున్నట్లు ఆరోపించారు. ఎవరిని చంపి పేగులు మెడల వేసుకుంటావని ప్రశ్నించారు. సీఎం హోదాలో ఉండి ఏవిధంగా ప్రవర్తించాలో ముందు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలను చిన్న చూపు చూస్తూ.. నోటికి వచ్చిందల్లా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల మేలుకు పాటుపడే వ్యక్తి అయితే పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాలకు ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు తీసుకురావాలని సవాల్ విసిరారు. జిల్లాలో ఏది మంజూరైనా నేనే సాధించానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, జాతీయ రహదారులకు కేంద్రం నుంచి నిధులు మంజూరు కానున్నట్లు గుర్తు చేశారు. గతం నుంచి కూడా కొడంగల్‌పై కల్వకుర్తి పెత్తనం కొనసాగుతున్నదని, మళ్లీ ఇప్పుడు పార్లమెంటు అభ్యర్థి కల్వకుర్తి వ్యక్తి ఉన్నారని పేర్కొన్నారు. స్థానికంగా ఉండే నాయకులను పట్టించుకోకుండా తన కనుసన్నల్లో ఉండే వారికే ప్రాధాన్యత కల్పించిస్తున్నట్లు ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీతో పాటు బీజేపీ నాయకులు సదానంద్‌రెడ్డి, ప్రతాప్, సర్వేశ్ పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ నారాయణరెడ్డి

మైసిగండిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రంగస్వామి

కడ్తాల్, ఏప్రిల్ 26: మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పోలీస్ అధికారులతో కలిసి, శుక్రవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కడ్తాల్ మండల పరిధిలోని ఏక్వాయిపల్లి, సాలార్‌పూర్, మైసిగండి, ఆమనగల్లు మండలంలోని జంగారెడ్డిపల్లి, మంగల్‌పల్లి, ఆమనగల్లు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై స్థానిక పోలీసులతో చర్చించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. ఎన్నికల రోజు ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వేళ ఎవరైన అక్రమంగా మద్యం, గంజాయి, డబ్బులు సరఫరా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించండి

కందుకూరులో మాట్లాడుతున్న సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సూరజ్‌కుమార్

కందుకూరు, ఏప్రిల్ 26 : ఎంపీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలని సహాయ రిటర్నింగ్ అధికారి కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సమావేశపు హాలులో సెక్టార్, తహసీల్దార్ మున్సిపల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీల్ ఓలు ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారని, స్లిప్పులను ఏ విధంగా పంపిణీ చేస్తున్నారో తనిఖీలు చేయాలని సూచించారు. ప్రతి ఓటరుకు స్లిప్పులు అందించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో నీరు, విద్యుత్, తాగునీరు, ర్యాంపులు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, వంటి వసతులను కల్పించాలన్నారు. ఎక్కడైనా వసతులు లేకపోతే తక్షణమే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా కృషి చేయాలని తెలిపారు. పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు గోపాల్, మాధవిరెడ్డి, విజయలక్ష్మి, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓలు సరిత, శైలజారెడ్డి, అధికారులు చంద్రశేఖర్, రఘు, వాణి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

మొండిగౌరెల్లిలో ప్రచారం నర్వహిస్తున్న బూర నర్సయ్యగౌడ్

యాచారం, ఏప్రిల్26: అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, నల్లవెల్లి, మాల్, మేడిపల్లి, నందివనపర్తి, చింతుల్ల, చౌదర్‌పల్లి, యాచారం గ్రామాల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు అమలు కానీ హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటున్నదని మండిపడ్డారు. రేవంత్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. దమ్మంటే ఆరు గ్యారేంటీలను అమలు చేసి ప్రజల ముందుకు రావాలన్నారు. చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రచారంలో ఎంపీపీ సుకన్య, మండల అధ్యక్షుడు రవి, నల్లవెల్లి మాజీ సర్పంచ్ డేరంగుల రాజు తదితరులున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 26: మోహన్‌నగర్ గ్రామంలోని ఎస్‌బీఎస్ కాలనీ వెళ్లే మార్గంలో వంద మీటర్ల పాటు నూతన డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులకు, జలమండలి అధికారులతో గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలోనూ ఈ సమస్యపై వివరించడం జరిగిందని వారు తెలిపారు. చెరుకు భూషణం గౌడ్ నివాసం నుంచి మోహన్‌నగర్‌లో జెండా దిమ్మ వరకు పైప్‌లైన్ మాత్రమే గతంలో వేసిన ఆరు ఇంచ్‌ల లైన్లు మాత్రం ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వారు తెలిపారు. మోహన్‌నగర్ గ్రామం మొత్తంలో వన్‌ఫీట్ లైన్ వేసిన అధికారులు ఈ కొంత భాగం మాత్రం వేయకపోవడంతో పాటుగా పెరిగిన జనాభా, పక్కనే నిర్మించిన నూతన అపార్ట్‌మెంట్ సముదాయం నేపథ్యంలో డ్రైనేజీ సమస్యలు పెరిగిపోయాయని వారు తెలిపారు. తమ డ్రైనేజీ సమస్యకు నూతన పైప్‌లైన్ వేసి పరిష్కారం చూపాలని మోహన్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ప్రతినిధులు మాణిక్ ప్రభు, చెరుకు భూషణం గౌడ్ కోరారు.

మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 26: కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి ఆర్ఎన్ఆర్ కాలనీలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర హరి సింగ్ ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారం కోసం మనువాదాన్ని మళ్లీ ముందుకు తీసుకొస్తున్నదని విమర్శించారు. బీజేపీ తీరును ఐక్యతగా ఖండించాలన్నారు. లౌకిక పార్టీలకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకన్న, సంఘం మండల అధ్యక్షుడు దాసరి ప్రసాద్, నాయకులు రాములు, ఈశ్వరయ్య, నారాయణరెడ్డి, పుల్లయ్య, నిరంజన్, అనసూయ, భిక్షం నాయక్, వినోద్‌నాయక్, శాంతయ్య, రాజు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 26 : మండలంలోని లష్కర్‌గూడ గ్రామ పంచాయతీ సుర్మాయిగూడలోని కేవికే ఫార్మసి కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌కు ఐక్యూవీఐఏ సీఆర్‌వో డైరక్టర్ రతన్, క్లినికల్ డైరక్టర్ ఉమాప్రియులు ముఖ్యఅతిథిలుగా హాజరై ఔషధ రంగంలో విద్యార్థులు రాణిస్తే రాబోయే రోజుల్లో ఉజ్వలభవిత ఉందన్నారు. ఔషధ ఆవిష్కరణలలో మెడికల్ రైటింగ్, క్లినికల్ రీసర్చ్ యొక్క ప్రాముఖ్యతను అందులో ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ఔషధ ఆవిష్కరణలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా మెళుకువలను నేర్చుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అతిథులను కళాశాల యాజమాన్యం సిబ్బందితో కలిసి సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత సతీశ్, ప్రిన్సిపాల్ రఘునందన్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 26 : బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని జడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాదాపూరు తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీ జేపీ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లను అడగాలని కోరారు. కార్యక్రమంలో అందుగుల సత్యనారాయణ, సాయిలు. ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, రాణాప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అయూబ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, ప్రవీణ్, అనిల్,బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటాం

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 26:గచ్చిబౌలి డివిజన్ మధురానగర్ కాలనీ బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు అంజమ్మ, బాలమణిలు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవంలేదని, తాము ఎల్లప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉంటామన్నారు. శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు స్థానిక మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి వివరాలు వెల్లడించారు. గురువారం కొందరు కాంగ్రెస్ నాయకులు మధురానగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బలవంతంగా కాంగ్రెస్ కండువాలు కప్పడం జరిగిందని, తాము కాంగ్రెస్‌లో చేరలేదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దారుకపల్లి నరేశ్ పాల్గొన్నారు.

రహదారిపై వ్యర్థాల పారబోత

ఓ నిర్మాణ సంస్థకు జీహెచ్‌ఎంసీ రూ.25వేలు జరిమానా

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 26: నానక్‌రాంగూడలో రహదారిపై నిర్లక్ష్యంగా వ్యర్థాలను పారబోసిన సుమధుర నిర్మాణ సంస్థ తీరుపై శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు జరిమానాగా రూ.25వేలను విధించిన శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు ఇక ముందు ఇలాంటి చర్యలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.25వేల జరిమానా రసీదును సుమధుర నిర్మాణ సంస్థ ప్రతినిదులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి పారిశుద్ధ్య విభాగం అధికారులు జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని గాన్గుమార్లతండా పంచాయతీలోని కాన్గుబావితండాలో నిరుపేద కుటుంబానికి చెందిన, నేనావత్ సుగుణ-బీమానాయక్ దంపతుల కుమార్తె మాన్విక వివాహం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి పెండ్లి కూతురికి రాధాకృష్ణ ట్రస్టు తరుపున రూ.21వేలు అందజేశారు. వారి వెంట డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, భూనాథ్‌నాయక్, నాయకులు రామకృష్ణ, పాండునాయక్, భీమన్, లక్ష్మణ్, రమేశ్, శ్రీను, రాజు, చందర్, హర్యా, రాజేశ్, జగన్ ఉన్నారు.

- కడ్తాల్, ఏప్రిల్ 26

పండ్లు విషతుల్యం..

పక్వానికి రసాయనాలు వాడుతున్న వ్యాపారులు
చోద్యం చూస్తున్న అధికారులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 26: ప్రతియేటా వేసవి కాలం రాగానే మామిడిపండ్లకు డిమాండ్ ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు మామిడితో పాటు ఇతర పండ్ల పక్వానికి రసాయనాలు వాడుతూ విషపూరితంగా మారుస్తున్నారు. పండ్లను విషతుల్యం చేసి అందిస్తున్న వ్యాపారులను అరికట్టడంలో అధికారులు విఫమవుతున్నారు. కొత్తపేటలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ యార్డును బాటసింగారానికి తరలించినప్పటికి కొందరు కొత్తపేట మోహన్‌నగర్ రోడ్డులో, మారుతీనగర్ వెళ్లే రోడ్డులోని కొన్ని భవనాలను అద్దెకు తీసుకుని పండ్ల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మామిడి కాయలను మార్కెట్‌లోకి తెచ్చి ఇక్కడ ఇథిలిన్ ప్యాకెట్లతో ట్రేలలో ప్యాకింగ్ చేస్తూ కృత్రిమంగా పక్వానికి తెచ్చే కార్యక్రమాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్తపేట ప్రాంతంలో మార్కెట్‌పై టాస్క్‌ఫోర్సు అధికారులు చేసిన దాడుల్లో మామిడి కాయలను రసాయనాలతో ప్యాకెట